# చుట్టుపక్కల చూడరా!

– కర్లపాలెం హనుమంతరావు



## సమకాలీన సమస్యలపై వ్యంగ్యాస్త్రాల పరంపర!!

2

## సంపూర్ణ మద్యపానం

**మద్యం వద్దని మన మహిళామతల్లులు** ఎన్నోసార్లు ఉద్యమాలు చేశారు గానీ... తాగుడు వల్ల బోలెడన్ని ప్రయోజనాలున్నాయన్న విషయం వాళ్ళు మరిచిపోయి ఉంటారనుకుంటాను.. కరువుకాలంలో మొగుడనే యములాడు వేళాపాడూ లేకుండా ఇంటికొచ్చి ఏ కోడి పలావో కొండమీద కోతో కావాలని కొప్పుపట్టుకుంటే, పాపం ఆ ఇంటిదీపం ఏం చేస్తుంది? మస్తుగా తాగి మత్తుగా పడున్న వాడికన్నా ఈ కాలంలో మంచివాడు లేడు. కట్టుకున్నవాడు కట్టేసినట్లు పడున్న కాసేపే కదా ఇల్లు శాంతినివాసంలాగా హాయిగా ఉండేది. కుచేలుడు కూడా కుబేరుడిలాగా ఫీలయే ఈ ఫీల్ గుడ్ అమృతాన్ని అమ్మలక్కలెందుకు వద్దంటున్నారో అర్థం కావడం లేదు.

బైట బోలెడంత కాలుష్యం. రోడ్డు మీద కొస్తే ఏదో ఒక ప్రమాదమే. మగాడు జేబులో డబ్బాడుతున్నంతసేపు ఎంత పెద్ద జల్సా పురుషుడో చెప్పే పని లేదు. తప్పతాగి ఇంటి పట్టునే పడుంటే ఏ గొడవా ఉండదు. పైగా ప్రత్యక్ష దైవాన్ని పొద్దస్తమానం కంటిముందే చూసుకునే అదృష్టం, ఇంటి ఇల్లాలికి ఇంతకుమించి ఏ వ్రతం, నోమూ కల్పిస్తుంది?!

తప్ప తాగినవాడు తప్పు చేయలేడు. ఆ రకంగా స్వర్గప్రాప్తికి మందు నూరు శాతం గ్యారంటీ. సగం తాగిన వాడితోనే ఆఘాలు ఎక్కువ అత్యాచారాలూ అఘాయిత్యాల్లాంటి వెధవ పనులన్నీ కడుపు నిండని వాడితోనే కదా వచ్చి పడేది! అందుకే శాంతి భద్రత అదుపులోకి రావాలంటే ముందు సందుకో మందుల షాపు రాత్రింబవళ్ళు తెరిచి ఉంచాలి. అంతగా మరీ గుళ్ళ పక్కన, బళ్ళపక్కనా బాగుండదనుకుంటే దేవుళ్ళనీ, పిల్లలనీ వేరే చోటికి తరలించుకోవచ్చు, గృహహింస, రాజ్య హింస తగ్గు ముఖం పట్టటానికి పెగ్గును మించిన మంచి సాధనం మరొకటి లేదు.

వైద్యరీత్యా కూడా దగ్గుకి పెగ్గు మంచి మందే. ఆల్కహాలు రక్తాన్ని పల్చబరుస్తుంటుంది. గుండెజబ్బులు రావు. మరింత చవకైన ఔషధ మీద నిషేధం కోరటమేంటి... విడ్డూరం కాకపోతే! ప్రతిపక్షాల కేం పనీ పాటా లేదు అప్పట్లో పాటలనాపటానికి ప్రయత్నించారు. వారధికారంలో ఉన్న తొమ్మిదేళ్ళు మందు మానేసారా? మేం అపోజిషన్లో ఉన్న రోజుల్లో ఇంతకన్నా ఎక్కువే మందును వద్దాన్నాం. ఎన్ని చెప్పినా ఏ ఎన్నికా మద్యం లేకుండా విజయవంతమైన దాఖలాలు లేవు. మద్యం విషయంలో రాజకీయాలు ఎవరికీ మంచివి కావు.

సర్కారు బొక్కసం చాలాసార్లు నిండుకుంటుందనిని ఎక్కాలు రాని పిల్లాడిక్కూడా తెల్సు. ఉన్న భూములన్నీ అమ్ముడై పోయాయి. దేవుడి సొమ్ము మాయమై పోయింది. కరువులూ, వానలూ, వరదలూ మన అదుపులో లేవు. కేంద్రం చేతులెత్తెయ్యడం అలవాటే. వరల్డు బ్యాంకు అప్పు వడ్డీలకే లక్షకోట్ల బడ్జెటు సర్దుబాటవడంలేదు. చవకదుకాణాలు నడవాలన్నా మరన్ని బార్లూ బార్లా తెరిచి

ఉండకతప్పడం లేదు. బాపుండదు గానీ.. బాపూజీ జయంతి వర్ధంతులనాడు కూడా బార్లు బార్లా తెరిచి ఉంచకపోతే ఆ భారాన్ని గవర్నమెంటు తట్టుకునే స్థితిలో లేదు. ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు కనీసం కుంటుతూ నడవాలన్నా, పిల్లకాయల ఉపకారవేతనాల కోసమన్నా పెద్దవాళ్ళు పెద్దమనసుచేసుకుని మరింత మందు తాగడానికి ముందుకు రావాలి. అలవాటు లేనివాళ్ళు ఇప్పటినుంచే అలవాటు చేసుకోవాలి. ఊరికే పన్నులు కట్టమంటే ఎవరు ముందుకొస్తారు? మధ్యాహ్న భోజనంలో సాంబారు కాస్త చిక్కగా ఉండాలన్నా, గుండె బిక్క పట్టుకుని తలా రెండు చుక్కలు ముక్కు మూసుకునన్నా తాగకపోతే రాష్ట్రద్రోహం కిందకే వస్తుంది. ముందే హెచ్చరిస్తున్నాం. తాగనివాళ్ళ మీద పన్నులు వేసే ఆలోచనకూడా ఉంది. లేకపోతే పావలా వడ్డీకి వేలాది రూపాయలు ఎక్కడినుంచి వస్తాయి? లక్ష కోట్ల బడ్జెట్లు ఊరికే పెట్టడం లేదు. మరి మహిళామణులు ఇట్టే లక్షాధికారులెలా అవుతారు? కిలో రెండు రూపాయల బియ్యం పావుకిలో తగ్గినా ఊరుకోరే..మరి బార్లు, బెల్టులు వద్దంటే కుదురుతుందా?

వోక్సువేగనూ, ఫాబ్ సిటీ ఎలానూ తిరిగి తెచ్చుకోలేం. స్పిరిటు వ్యాపారన్నన్నా నిలుపుకోలేక పోతే ప్రభుత్వం ఒక్క అడుగు ముందుకు వెయ్యలేదని ప్రభువులు ఎప్పటినుంచో చెబుతున్నారు. గుజరాత్ వారికి ఆయిల్ ఉంది. మద్రాసు వారికి సాంబారు ఉంది. మరి మనకి బార్లూ, కల్లు దుకాణాలూ, సారా అంగళ్ళే కదా ప్రధాన ఆదాయ వనరులు.!

పెట్టుబడులు మరిన్ని రావాలన్నా, 'రా' కి మించిన మంచి సాధనం మరొకటి లేదు. బళ్ళూ, ఆసుపత్రులూ, పోలీసు స్టేషన్లు జనాభా కింతని పెట్టుకున్నట్లే కల్లు దుకాణాలు పెట్టుకుంటే తప్పేంటో అర్థం కావటం లేదు.

దయచేసి మద్య నిషేధ ఉద్యమాలని నిద్రలేపకండి.. ఇంటికో దేవదాసు తయారయే దిశగా ముందుకు రండి! ఉగ్గుపాలకు బదులు పెగ్గు పాలతో కలిపి మీ పిల్లలకు పోయకపోతే.. ముందు ముందు మందు తరాలు తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఆడపడుచుల్లో మార్పు రాకపోతే ఎన్ని ఆర్థిక సంస్కరణలు వచ్చినా ఫలితం సున్నా.

సంపూర్ణ మద్యపాన నిషేధం కోసం కాదు. సంపూర్ణ మద్యం కోసం ఉద్యమించాల్సిన సమయం ముంచుకొచ్చిందని మన తరుణీమణులు తెలుసుకోవాల్సిన తరుణం ఇది.

Post your comments